డుర్-డుర్-

డుగ్-డగ్ అని ఆగిపోయింది బస్సు. వెంటనే డ్రైవర్ "బ్రదర్ బస్ కదలటంలేదు. పాసెంజర్లని దిగి తొయ్యమను" అన్నాడో లేదో బస్సులో నిలబడ్డవాళ్ళు "మాకేం పట్టింది మమ్మల్ని తీసుకెళ్ళనంటున్నాడు కండక్టర్ మేమెందుకు తోస్తాం?" అన్నారు. దానితో రాజీ పథకం తయారయింది.

"బస్సు తొయ్యండి-అందర్నీ తీసుకువెళతాం" అన్నారు. మళ్ళీ అందరూ పోటీపడి దిగి, బస్సు తోయ్యసాగేరు. ఒక వందగజాలు తోసేక చైత్రరథం కదిలింది, ఇక ఆగితే వొట్టు. టాప్‌గేర్‌లో వెళ్ళిపోయింది బస్సు.

"మమ్మల్ని ఎక్కించుకోకుండా వెళ్ళిపోతున్నాడేమిటి?" అని చూస్తున్న ప్రయాణీకులకు కళ్ళలో మట్టిపడి కళ్ళు నులుముకుంటున్నారు వాళ్ళు మరో బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు వస్తుందో ?

—o—

## షష్ఠీ విభక్తి

వేసవికాలం ప్రవేశిస్తుంది. పిల్లలకి పెద్ద పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. తెలుగుమాస్టారు అవధానిగారు పిల్లలచేత బాగా చదివిస్తున్నారు.

సమయం రాత్రి తొమ్మిదయింది. పిల్లలందరూ రాత్రి పదింటి వరకూ మాస్టారింట్లోనే చదువుకోడం, అక్కడే పడుకోడం, తెల్లారు జామున నాలుగున్నరకు మాస్టారు బెత్తంతో నిద్రలేపి ఉదయం ఆరు గంటలవరకూ చదివించి ఇంటికి తోలేయడం ఇదీ దినచర్య.

పిల్లలతో పాటుగా ఇంటి వరండాలో రెండు మంచాల మీద తనూ, భార్యా, పిల్లలూ, ప్రయివేటు పిల్లలతోనూ పడుకుంటారు.

సమయం తొమ్మిదిన్నర అయింది.

అవధానిగారి నోట్లో వక్కపొడి నిరంతరంగా పిండిమరలో ఏదో ఒక ధాన్యం నలిగినట్లు నలగాల్సిందే. దీనికి తోడు ఆయనకు మూడ్ వచ్చి

నప్పుడల్లా ఒక తులం నశ్యం నషాళానికి అంటేవరకూ పీల్చడం అలవాటు ఇది తప్పితే అవధానిగారికి వేరే చెడు అలవాట్లు లేవు.

"ఏవోయ్-ఇవాళ షష్ఠీవిభక్తా?"

"ఏమిటో నాకు వినపడటంలా" అంటూ అవధానిగారి భార్య వచ్చింది.

"ఇవాళ షష్ఠీ విభక్తేనా. చాలా రోజులైందోయ్" అని ఆయన ఈసారి నెమ్మదిగా చిరునవ్వుతో అన్నాడు.

"చాల్లెండి సంబడం" అంటూ ఆమె విసవిసా లోపలికి వెళ్ళిపోయింది.

ఈలోగా ఇదంతా ఒక గడుగ్గాయి విన్నాడు.

"మాస్టారూ-విభక్తులు చెప్పి చాలా రోజులైంది. ఒకసారి రివిజన్ చేస్తారా?" అన్నారు.

"చెప్పినవి చదవండి భడవాయిలూ" అంటూ ఒక తులం నశ్యం రవాణాచేశాడు ముక్కులోకి—

ఆ శబ్దానికి ఎక్కాలు బట్టీపడుతున్న చిన్న పిల్లాడు "అమ్మోయ్" అని దడుచుకున్నాడు—

ఇంకో గడుగ్గాయి—

"మాస్టారూ-మీరు షష్ఠీ విభక్తి అంటే అమ్మగారు కోపంగా వెళ్ళిపోయారేంటి? అమ్మగార్కి షష్ఠీ విభక్తి అంటే తెలియదా? చెప్పలేదా సార్"—

"నోర్మూసుకోవోయ్ వెధవాయ్"

వేసవికాలంలో పిల్లలతో బయట పడుకునేటప్పుడు ఆ అవసరం వచ్చినప్పుడు అవధానిగారు ఆయన భార్యా "షష్ఠీ విభక్తి" అని కోడ్‌భాష పెట్టుకున్నట్లు ఆ వెధవాయ్‌కి తెలియదు.

షష్ఠీ విభక్తి అనగా లోన్-లోపలన్-

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక—6-87)

—o—